## లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## ఖమ్మంలో రైతుల కోసం మహాధర్నా

ఖమ్మం,: రైతులు గత కొద్ది రోజులుగా పడుతున్న ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో రైతు మహా ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మదు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున తరలి వచ్చిన రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. మొక్కజొన్నలను, వరిని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ.. జేసీ శ్రీనివాసరెడ్డికి లికిత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఇతర పార్టీ ముఖ్య నాయకులు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలను, రైతులు పట్ల వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. ప్రభుత్వంపై విమ్మర్శలు చేశారు.


నల్లగొండ | సంపుటి:16 | సంచిక:97 | ఎడిటర్: సయ్యద్ పాష | 25-04-2026 శనివారము | పేజీలు :8 | వెల:1/-


## ఆవేశంలో అఘాయిత్యాలకు పాల్పడవద్దు..



హైదరాబాద్: ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలు జరుపుతుందని సూచించారు. ఆర్టీసీ కార్మికులు అధైర్యపడవద్దన్న మంత్రి పొన్నం కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరుపుతోందని తెలిపారు. కార్మికులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలుపుకోవాలని, ఆవేశంలో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు నిరసనలకు మద్దతు ఇవ్వడం వల్ల అభ్యంతరం లేదన్న ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదని సూచించారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే ఇలాంటి ఘోరమైన ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. నేతలు కూడా సంయమనం పాటించాలని పొన్నం ప్రభాకర్ కోరారు.

## అక్కృత్యాల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కల్పిస్తాం'



పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. "తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదు'' అని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహాటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. "రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం" అని మోదీ అన్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీకి బిగ్ షాక్..




న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కు భారీ షాక్ తగిలింది. ముగ్గురు ఆప్ రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీలో తిరుగుబాటు మొదలైందనే చెప్పాలి. ఇటీవల పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి ఆప్ రాఘవను తొలగించిన విషయం తెలిసిందే. రాజ్యాంగంలోని నిబంధనలను ఉటంకిస్తూ, రాజ్యసభలో తమ పార్టీ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది భారతీయ జనతా పార్టీ లో విలీనం కావాలని నిర్ణయించుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా శుక్రవారం ప్రకటించారు. సహచర ఎంపీలు సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్‌లతో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ... ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలో రక్షణ కోరేందుకు అవసరమైన మెజారిటీతో ఈ నిర్ణయాన్ని సమిష్టిగా తీసుకున్నట్లు తెలిపారు. "నేను నా రక్తం, చెమటతో పోషించి, నా యవ్వనంలోని 15 ఏళ్లను అంకితం చేసిన ఆప్ పార్టీ, తన సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుండి పక్కదారి పట్టింది. ఇప్పుడు ఈ పార్టీ దేశ ప్రయోజనాల కోసం కాకుండా, కేవలం తన స్వప్రయోజనాల కోసమే పనిచేస్తోంది. గత కొన్ని ఏళ్లుగా, 'నేను సరైన వ్యక్తిని అయినప్పటికీ, తప్పుడు పార్టీలో ఉన్నాననే' భావన నాకు కలుగుతూ వచ్చింది. కాబట్టి, ఈ రోజు నేను 'ఆప్' నుండి వైదొలుగుతూ, ప్రజలకు మరింత చేరువవుతున్నట్లు ప్రకటిస్తున్నాను." అంటూ ఆయన పేర్కొన్నారు.

## 18వేల సమ్మర్ స్పెషల్ రైళ్లు



న్యూఢిల్లీ:వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వే భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా అధిక రద్దీ ఉండే మార్గాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించేందుకు ఈ ఏడాది వేసవి కాలంలో 18,262 ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు, అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ వేసవి ప్రత్యేక రైళ్ల నిర్వహణపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం దిల్లీలో సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రద్దీ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను సమర్థవంతంగా నడిపేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమేరకు రైల్వే మంత్రిత్వ శాఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూలై 15 వరకు ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మొత్తం 18,262 సమ్మర్ స్పెషల్ రైలు ట్రిప్‌లను నిర్వహించనున్నారు. అలాగే 11,878 ప్రత్యేక రైలు ట్రిప్‌లకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. మిగిలిన రైళ్ల వివరాలను కూడా దశలవారీగా ప్రకటించనున్నారు. అదనపు రైళ్ల లభ్యత, సమర్థవంతమైన షెడ్యూలింగ్, నిరంతర పర్యవేక్షణ ఆధారంగా ఈ ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే న్యూదిల్లీ, ముంబయి, పుణె, సూరత్, ఉధ్నా, అహ్మదాబాద్, బెంగళూరు వంటి ప్రధాన స్టేషన్లలో ప్రయాణికులు సులభమైన రాకపోకలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్టేషన్ ప్రాంగణాల్లో రద్దీ నియంత్రణ, అదనపు సిబ్బంది నియామకం, ప్రయాణికులకు మార్గదర్శక సేవలు, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేశారు. పశ్చిమ రైల్వే పరిధిలోని ఉధ్నా స్టేషన్‌లో రియల్‌టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, ప్రయాణికులకు మెరుగైన ఆన్-గ్రౌండ్ మద్దతు, సమర్థవంతమైన రైలు నిర్వహణ ద్వారా ఆదర్శవంతమైన చర్యలు చేపట్టారు. ఈ చర్యలు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, అవాంతరాలు లేని ప్రయాణ అనుభవాన్ని అందించడానికి జాతీయ స్థాయి కార్యక్రమాలకు ప్రభావవంతమైన తోడ్పాటుగా నిలుస్తున్నాయి. సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం రైల్వే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. స్టేషన్లలో సక్రమమైన బోర్డింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా సిబ్బంది సహకారంతో ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రైళ్లలో ఎక్కేందుకు మెరుగైన ఏర్పాట్లు చేశారు. ఉధ్నా-థావే తపతి గంగా ఎక్స్‌ప్రెస్ (రైలు నెం. 19045)లో ప్రయాణికుల రద్దీని నియంత్రించి, సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా, క్రమబద్ధంగా రైలు ఎక్కించడంలో సహాయపడ్డారు. అలాగే, మొత్తం బోర్డింగ్, సీటింగ్ ప్రక్రియను క్రమపద్ధతిలో నిర్వహించారు. వేసవి రద్దీ సమయంలో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఇబ్బందుల్లేని ప్రయాణాన్ని అందించడమే భారతీయ రైల్వే లక్ష్యమని అధికారులు తెలిపారు. ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన నిర్వహణ, తక్షణ స్పందనతో ప్రయాణికుల సేవలను మరింత మెరుగు పరచేందుకు రైల్వే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



'ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి ఇంకా 6 రోజులే గడువు' నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్

నల్లగొండ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

## కార్మికులారా... బలిదానాలు వద్దు



హైదరాబాద్: వరంగల్ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపట్ల కేంద్రమంత్రి బండిసంజయ్ కుమార్ దిగ్భ్రాంత్రి వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్నికి చిత్తశుద్ధి లేదని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అభయహస్తం పేరుతో మేనిఫెస్టో విడుదల చేశారని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంవచ్చి 900 రోజులైనా.. హామీల అమలు ఏమైంది? అని ప్రశ్నించారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ కార్మికులు సంయమనం కోల్పోవద్దని కోరారు. కమిటీల పేరుతో రేవంత్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బండి సంజయ్ మండిపడ్డారు. ఢిల్లీకి మూటలు అప్పగించేందుకు డబ్బులు దండిగా ఉన్నాయి కానీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి మాత్రం డబ్బులు లేవు అని ఆయన ఫైర్ అయ్యారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు డబ్బులు తెలంగాణ నుంచే వెళ్తున్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి డబ్బులు వెళ్తేగానీ కాంగ్రెస్ పార్టీ నడవదన్నారు. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. రెండు పీఆర్ సీ బకాయిలు తక్షణమే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లెక్కనే కాంగ్రెస్ వ్యవహారిస్తోందని ఆయన హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దన్న కేంద్రమంత్రి కొట్లాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## ఒకే నెలలో 46 వేల ఉద్యోగాలు కట్..



న్యూఢిల్లీ:ఐటీ అనుబంధ సంస్థల్లో భారీ స్థాయిలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. ఏఐ కారణంగా ఆయా సంస్తల్లో వేలాది మందిని ఉద్యోగంలోంచి తొలగిస్తున్నారు. త్వరలో టాప్ కంపెనీల్లో కూడా భారీగా కోతలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కలిసి వచ్చే జూన్‌లో భారీగా ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈ మూడు సంస్థలు కలిసి జూన్‌లో ఏకంగా 46,750 మంది సిబ్బందిని తొలగించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత మార్చిలో కూడా అనేక సంస్థలు ఉద్యోగుల్ని తొలగించాయి. ఏఐ టెక్నాలజీ మీద పెట్టుబడులకు సిద్ధమవ్వడం, కంపెనీలో నిర్మాణాత్మక మార్పుల కారణంగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. ఒకవైపు తమ కంపెనీలు వృద్ధి బాటలోనే నడుస్తున్నాయని చెబుతూనే, భవిష్యత్తు బాగుంటుందని చెబుతూనే ఉద్యోగుల్ని తొలగిస్తుండటం విశేషం. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కూడా ఇప్పుడు ఇంకో 46,750 మందిని తొలగించబోతుండటం ఆసక్తికరంగా మారింది. మెటా సంస్థ తన కంపెనీలో పని చేస్తున్న వారిలో పది శాతం మంది ఉద్యోగుల్ని.. అంటే కనీసం 8,000 మందిని తొలగించాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా కొంతమందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలి అని ఇంతకుముందు తీసుకున్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇదే సమయంలో ఏఐ టెక్నాలజీ పై మెటా భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ఏడాది 135 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయాలని కంపెనీ నిర్ణయించింది. అంటే, గత మూడేళ్లలో కంపెనీ ఏఐ మీద పెట్టుబడి పెట్టిన దానితో సమానం. ఏఐ టెక్నాలజీ సిబ్బంది అవసరాన్ని తగ్గిస్తుందని గతంలోనే మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఒరాకిల్ సంస్థ కూడా 30,000 మందిని తొలగించబోతుంది. ఇప్పటికే కొందరికి దీనికి సంబంధించిన మెయిల్స్ వచ్చినట్లు ఉద్యోగులు చెబుతు న్నారు. మెయిల్ వచ్చినప్పటి నుంచే ఉద్యోగంలోంచి తొలగిస్తారు. మరోవైపు మైక్రోసాఫ్ట్ సంస్థ 8,750 మంది సిబ్బందిని తొలగించాలని నిర్ణయిం చింది. అంటే సంస్థలో 7 శాతం సిబ్బందిని తొలగించబోతుంది. అయితే, సిబ్బందికి వాలంటరీ రిటైర్‌మెంట్ అవకాశం కల్పిస్తోంది. మైక్రోసాఫ్ట్ స్థాపించిన 51 ఏళ్లలో ఇలాంటి ప్రతిపాదన తీసుకురావడం ఇదే మొదటిసారి.

## మహనీయుల ఆశయాల సాధనలో ముందుకు సాగాలి

నల్లగొండ: మహనీయుల చూపిన ప్రజ్ఞ, కరుణ, పోరాటాల బాటలో ముందుకు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, తెలంగాణ ఆర్టీఐ కమిషనర్ శ్రీ దేశాల భూపాల్, ప్రొఫెసర్ మహమ్మద్ అబ్దుల్ మాలిక్ హాజరై త్యాగధనుల సేవలను కొనియాడుతూ విద్యార్థులకు కర్తవ్య బోధ చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ.. విద్య ద్వారా సంక్లిష్టతలకు సమాధానాలు, సన్మార్గానికి, సామరస్యతలకు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని, విద్యను సాధనంగా భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా ద్వారా పరిపూర్ణమైన మార్పుతో పాటు ప్రపంచాన్ని పరిచయం చేసి ముందుకు నడిపించే సాధనంగా కీర్తించారు. సదాశయంతో మంచి దృక్పథంతో ప్రణాళికతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరు అనడానికి మహనీయుల జీవితాలే సాక్ష్యం అన్నారు. వారి అడుగుజాడల్లో పయనించి దేశాన్ని అభివృద్ధి పదంలో నడపాలని సూచించారు. ప్రజ్ఞ, కరుణ, పోరాటాల బాటలు భావితరాలకు స్ఫూర్తి అన్నారు. ఆర్టీఐ కమిషనర్ శ్రీ దేశాల భూపాల్ మాట్లాడుతూ.. జీవితంలోని సవాళ్లను స్వీకరించి, నైరాశ్యానికి తావు లేకుండా అంచెలంచెలుగా తమను తాను మలుచుకుని కోట్ల మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన పూలే, అంబేద్కర్ మహనీయుల జీవితాలు ఆదర్శమన్నారు. అనంతరం ఆచార్య అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ.. మహనీయుల రచనలు ప్రపంచవ్యాప్తంగా ఎందరో నాయకులను తీర్చిదిద్దాయని, సత్యశోధనకు అధ్యయనమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో కళాకారుడు రేలారే ప్రసాద్ తన పాట మాటతో విద్యార్థులను అలరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య సరిత, ఆచార్య అలువాల రవి, డా.రవితేజ, ఆచార్య వసంత, డా.అరుణప్రియ, డా.ప్రేమ్ సాగర్, డా.మద్దిలేటి, డా.జ్యోతి, డా.సబీనా హెరాల్డ్, డా.హరీష్ కుమార్, డా.దోమల రమేష్, డా.మిరియాల రమేష్ పాల్గొన్నారు.

## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం..

హైదరాబాద్: వరంగల్ జిల్లా నర్సంపేట బస్ డిపో దగ్గర ఆర్టీసీ సమ్మెలో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. తెలంగాణ ప్రభుత్వం బాధితుడి కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. నర్సంపేట ఆర్‌డీఓ ఉమారాణి శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళి అర్పించిన అనంతరం పరిహారం ప్రకటించారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని అధికారుల హామీ ఇచ్చారు. నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మానవత్వం చాటుకున్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.5 లక్షల సాయం చేస్తానని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం, ఎమ్మెల్యే సాయం పట్ల కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు...

ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్. తెలుగు రాష్ట్రాల నుంచి వస్తున్న సమాచారం వింటుంటే ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురౌతాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. గ్యాస్ సిలిండర్లను ఎండలో ఉంచరాదు. ఎయిర్ కండిషనర్ల వినియోగం పేరిట విద్యుత్ వాడకాన్ని పెంచరాదని సూచన.పెంపుడు జంతువులను కూడా వడదెబ్బ నుండిరక్షణ కల్పించా ల్సిన బాధ్యత మనదే. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే మంగళశారం నాడు తెలుగు రాష్ట్రాలలో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినందున ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వ శాఖలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ రోజుల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవా లో, సూచిస్తున్నారు. అధిక నీటిని తాగాలన్నది వారి సలహా. వృద్ధులను, పిల్లలను బయటికి రావద్దని ప్రభు త్వాలు హెచ్చరిక చేస్తున్నాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. అతివేడిమి ఉన్న రోజు ల్లో భూమి మీదనేరుగా 70శాతం అతి నీల లోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. వీటి ఫలితంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి, అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వైద్య సహాయంకోసం పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఉక్కపోత నుంచి ఉపశమనానికి గాలి చొరబడే గదుల్లో గాలి వచ్చేలా తలుపులు కిటికీలు తెరుచుకునేటట్లు ఉం చాలి. మొబైల్ ఫోన్లు పేలిపోవచ్చు.ద్విచక్రవాహనాలకు పెట్రోలు ట్యాంక్ ఫుల్ చేయవద్దని సూచిస్తున్నారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలనే సూచనలు ఉన్నా యి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వారం రోజులు హీట్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తుతాయి. శ్రామిక జనం ఎండవేడిమి లేని ప్రాంతాల్లో పనికి వెళ్ళాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు, వేసవిలో ఎండ తీవ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటినప్పటి నుంచి సమస్యలు పెరుగుతాయి. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45 డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు ఈ స్థాయి కి చేరినప్పుడు బయట ఎక్కువసేపు ఉంటే త్వరగా అల సట, నీరసం ముంచుకొచ్చి, డీహైడ్రేషనకు లోనవడం, వాంతులు, తలతిరగడం, వడదెబ్బకు లోనవడం వంటి ప్రమాదాలు తలెత్తవచ్చు. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిన ట్లయితే, వడదెబ్బ సోకే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఈ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు. గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి.భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 40.5-42.5 డిగ్రీల వరకు తెలంగాణలో 41.5 నుంచి 43.5 డిగ్రీల వరకునమోదవుతున్నాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతు న్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఇప్పుడు మీద పడనున్న ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది. దానికితోడు అత్యల్ప వర్షపా తం కూడా రేపటి వ్యవసాయ కార్యాచరణపై ప్రభావం చూపుతుంది. భారత్లోకి వచ్చే మొత్తం వర్షపాతం సుమా రు 75 శాతం వస్తుంది. ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావం వ్యవసాయ దారులను ఇబ్బందులకు గురిచేసే టట్లుగా ఉండచ్చు. వర్షాధార ఖరీఫ్లో సాగు ఆయకట్టు బాగా తగ్గుతుంది నీటి వనరులు ఎండిపోవడం, సాగు అవసరాలు తీర్చే నీరు లభ్యత కాకపోతే సాగులో కొంత ఆయకట్టు తగ్గుతుంది. జూన్, జూలై నెలల్లో అతి తక్కువ వర్షపాతం వలన దేశంలోని అన్నిప్రాంతాలు నీటికరువుని ఎదుర్కొంటాయి. ఈఏడాది వర్షపాతం 94శాతంమాత్రమే ఉంటుంది. కొంత మేర కరువు పరిస్థితుల్ని చూడొచ్చు.

## నోయిడా కార్మికులకు న్యాయ సహాయమందిస్తాం

న్యూఢిల్లీ :నోయిడా సమ్మె అనంతరం పోలీసుల చర్యలకు గురైన కార్మికులకు అన్ని రకాల న్యాయ సహాయం అందిస్తామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు తెలిపారు. సుమారు వంద మంది కార్మికులు ఇప్పటికీ పోలీసుల అదుపులోనే ఉన్నారని, ఎఫ్ఐఆర్తో సహా పోలీసులు ఎలాంటి సమాచారాన్ని విడుదల చేయలేదని పేర్కొన్నారు. కార్మికుల సమ్మెకు సంబంధించి సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. గురువారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐలు నేతలు సునీల్ కుమార్, సుభాష్ చంద్రన్, ఆద్రిజా భద్ర, డీవైఎఫ్ఐ నేతలు రిషి నంది, ఉపాసన గోయల్, ఎస్ఎఫ్ఐ నేత అచింత్య మాట్లాడారు. సమ్మె అనంతరం లాయర్స్ యూనియన్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల బృందం నోయిడాకు చేరుకుని వాస్తవ నిర్ధారణ నివేదికను సిద్ధం చేసిందన్నారు. వెయ్యి మందికిపైగా పోలీసులు కార్మికులను అదుపులోకి తీసుకున్నారని, వారిలో 300 మందికిపైగా చిన్నారులు ఉన్నారని దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. "నోయిడాలో జరిగిన పరిణామాలు ఊహకు మించినవి. ప్రభుత్వ చర్య రాజ్యాంగం కల్పించిన అన్ని రక్షణలను ఉల్లంఘించింది. మహిళలు, పిల్లలపై దాడి జరిగింది. అదుపులోకి తీసుకున్న వారికి న్యాయ సహాయం నిరాకరించబడింది. పోలీసులు కనీసం యూనిఫాం కూడా లేకుండా చర్యలు చేపట్టారు. అదుపులోకి తీసుకున్న వారిని కోర్టు ముందు హాజరుపరచడానికి పోలీసులు సిద్ధంగా లేరు" అని వారన్నారు."విచారణ నివేదికను సిద్ధం చేయడానికి వెళ్లిన బృందాన్ని అడ్డుకునేందుకు కూడా పోలీసులు ప్రయత్నించారు. కార్మికులు, ప్రజలతో మాట్లాడకుండా బృందం సభ్యులను నిరోధించారు. అదుపులోకి తీసుకున్న వారి గురించి సమాచారం ఇవ్వడానికి పోలీసులు నిరాకరించారు. మీరు బయటి వ్యక్తులు, ఈ విషయంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు?" అని పోలీసులు బదులిచ్చారని ప్రతినిధులు తెలిపారు. నిరసనల నేపథ్యంలో గృహ నిర్బంధంలో ఉన్న సీఐటీయూ నాయకుడు గంగేశ్వర్ దత్ శర్మ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

జగిత్యాల : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించ డమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగు తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి నివేదనలో భాగంగా నిర్వహి స్తున్న 99రోజుల కార్యాచరణలో భాగంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ జిల్లాకేం ద్రంలోని స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురు కుల డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల తో కలిసి వారు అల్పాహారం చేశా రు. అనంతరం మంత్రి లక్ష్మణ్కు మార్ మాట్లా డుతూ ప్రజాప్రభుత్వంలో విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థు లకు అల్పాహారం అందించడానికి చర్యలు చేపట్టా మని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజ్కుమార్, ప్రిన్సి పాల్ గునుక శ్రీలత, మాజీ ఛైర్మెన్ గిరినాగ భూషణం, డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, కౌన్సిలర్ దుమాల రాజ్కుమార్ ఉన్నారు.

## ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

వేములవాడ : ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తు న్నామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎదురుగట్ల, లింగం పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ల సొంతింటి కల నెరవేర్చే విధంగా అర్హులైన ప్రతీ పేదవాడికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించడ మే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదవారి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సామ తిరుపతిరెడ్డి, రంగు వెంకటేశం, కడారి సంధ్యశ్రీని వాస్, మార్కెట్కమిటీ చైర్మెన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు సోయినేని కరుణాకర్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డీఎన్ఏ టెస్టులో తండ్రి కాదని తేలితే భరణం కట్..

న్యూఢిల్లీ:వివాహ వ్యవస్థలో నైతికత మరియు చట్టపరమైన బాధ్యతలపై సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పును వెలువరించింది. డీఎన్ఏ పరీక్షలో ఒక వ్యక్తి సదరు బిడ్డకు తండ్రి కాదని శాస్త్రీయంగా తేలితే, ఆ బిడ్డకు భరణం చెల్లించాల్సిన బాధ్యత సదరు వ్యక్తిపై ఉండదని కోర్టు స్పష్టం చేసింది.కేవలం వివాహం జరిగింది కాబట్టి బాధ్యత తీసుకోవాలని ఒత్తిడి చేయలేమని కోర్టు తెలిపింది. వివాహేతర సంబంధం వల్ల పుట్టిన బిడ్డకు చట్టబద్ధమైన తండ్రి కాని వ్యక్తిపై పోషణ భారం మోపడం అన్యాయమని కోర్టు పేర్కొంది. ఈ తీర్పు భవిష్యత్తులో వచ్చే అనేక భరణం కేసులపై ప్రభావం చూపుతుంది.సదరు దంపతులకు 2016లో వివాహం జరిగింది. వివాహమైన కొద్ది కాలానికే ఆ దంపతులు విడిపోయారు. ఆ తర్వాత సదరు మహిళ ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తనకు పుట్టిన కుమార్తెకు భర్త జీవన భృతి కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. ఆ బిడ్డ తనది కాదని భర్త వాదించడమే కాకుండా, నిజానిజాల కోసం డీఎన్ఏ పరీక్షకు పట్టుబట్టాడు. ఈ కేసులో అత్యంత కీలకమైన మలుపు డీఎన్ఏ నివేదిక. పరీక్షా ఫలితాల్లో సదరు బిడ్డకు ఆ వ్యక్తికి ఎటువంటి జన్యుపరమైన సంబంధం లేదని తేలింది.బిడ్డ తనది కాదని శాస్త్రీయంగా నిరూపితమైనందున, ఆ బిడ్డకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని, కేవలం భార్యకు మాత్రమే మెయింటెనెన్స్ ఇవ్వాలని ట్రయల్ కోర్టు



తీర్పు ఇచ్చింది. అయితే సదరు మహిళ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు సబబేనని ధర్మాసనం స్పష్టం చేసింది. 'వేరొకరి వల్ల పుట్టిన బిడ్డను పోషించమని చట్టబద్ధంగా భర్తను ఆదేశించలేం' అని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది.

## భూసమస్యలను సత్వరం పరిష్కరించండి

నెన్నెల, : భూభారతి దరఖాస్తులతో పాటు, పరిష్కారం కోరుతూ కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి సబ్కలెక్టర్ మనోజ్తో కలిసి గురువారం నెన్నెల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..? ఎన్నింటిని పరిష్కరించారు.. ఇంకా ఎన్ని పెండింగ్లో ఉన్నాయో తహసీల్దార్ శ్రీనివాస్ను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయ రికార్డులు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. దరఖాస్తులు ఇచ్చి ఎన్నిరోజులు అవుతుంది... అధికారులు ఎం చెప్పారో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆలస్యం చేయకుండా రైతుల పనులను చేసి పెట్టాలని అధికారులకు సూచించారు.

## రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలి




హుజూర్నగర్, : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్నగర్ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది సమయం కాకముందే విధుల నుండి వెళ్లిపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్ కేంద్రాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరింటెండెంట్ను ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డు పొందాలని ఆకాక్షించారు.మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టీ హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కిరాయి ఖాతాలు ఉంటే కఠిన చర్యలు



హైదరాబాద్ : బ్యాంకుల్లో కిరాయి (మ్యూల్) ఖాతాలు ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ బ్యాంకర్లను హెచ్చరించారు. ప్రతీ బ్యాంకు శాఖలో 'జీరో మ్యూల్ ఖాతాల' లక్ష్యంగా పని చేయాలని, మ్యూల్ ఖాతాలను గుర్తించేందుకు 'మ్యూల్ హంటర్' వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. మ్యూల్ ఖాతాల నియంత్రణ అంశంపై హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో వివిధ బ్యాంకుల అధికారులతో సజ్జనార్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖాతాల పెంపు, టార్గెట్లు కాకుండా బ్యాంకు అధికారులు ఖాతాదారుల భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఏ ఒక్క ఖాతాదారు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడటవే ప్రాథమిక లక్ష్యం కావాలన్నారు. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలను అరికట్టేందుకు 'సేఫ్ కస్టమర్ ఛాలెంజ్'ను బ్యాంకులు స్వీకరించాలని, జీరో మ్యూల్ ఖాతాల లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎఫ్ఎ5.2.ఐజూస్త్రసైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్లో నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా అధికారులు తమ బ్రాంచీల పనితీరును అంచనా వేసుకోవాలని స్పష్టం చేశారు. ఆపరేషన్ ఆక్టోపస్ 2లో భాగంగా 850 కేసుల్లో రూ.150 కోట్ల మోసం జరిగినట్లు గుర్తించామన్నారు. ఈ కేసులకు సంబంధించి మ్యూల్ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులను అరెస్టు చేశామని గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్ల నెట్వర్క్ను పూర్తిగా తుడిచిపెట్టే వరకు ఆపరేషన్ ఆక్టోపస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఇక, కేవైసీ నిబంధనలను ఉల్లంఘించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారు తిరిగి బ్యాంకింగ్ రంగంలోకి రాకుండా బ్లాక్ లిస్ట్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి ఖాతాలు ఖాళీ చేసుకుంటున్న కస్టమర్ల విషయంలో బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ్కుమార్ సహా 45 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 75 మంది ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రౌడీ ఇన్స్పెక్టర్ స్థాయిలో రంజింపజేయాలి

బాలకృష్ణ ఖాకీ డ్రెస్సు వేస్తే బ్లాక్ బస్టర్ ఖాయమనేది అభిమానుల నమ్మకం. దానికి పునాది వేసింది రౌడీ ఇన్స్పెక్టర్. 1992లో విడుదలైన ఈ సూపర్ హిట్ మూవీ అప్పట్లో అభిమానులనే కాదు మాస్ ప్రేక్షకులను కూడా ఊపేసింది. దీని స్ఫూర్తితోనే దర్శకుడు వైవిఎస్ చౌదరి తర్వాతి కాలంలో హరికృష్ణని హీరోగా చేసి సీతయ్యతో శభాష్ అనిపించుకున్నారు. బాలయ్య లక్ష్మి నరసింహ రూపంలో మరో విజయం తన ఖాతాలో వేసుకున్నారు భగవంత్ కేసరిలో ఖాకీ దుస్తులు వేసింది కాసేపే. త్వరలోనే బాలకృష్ణ పూర్తి స్థాయి పోలీస్ ఆఫీసర్ ఆ కనిపించబోతున్నట్టు ఫిలిం నగర్ టాక్. నాంది, ఉగ్రం ఫేమ్ విజయ్ కనకమేడల చెప్పిన కథ బాగా నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వినికిడి. ఒక టాలీవుడ్ అగ్రనిర్మాత పెద్ద బడ్జెట్ తో దీన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. విజయ్ కనకమేడల రాసుకునే కథల్లో సందేశం ఉంటుంది. దానికి బాలయ్య మార్కు హీరోయిజం తోడైతే అవుట్ ఫుట్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. కాకపోతే సమర్ధవంతంగా హ్యాండిల్ చేయాలి. అంతర్గత వర్గాల ప్రకారం కొన్నేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఒక నిజ జీవిత సంఘటనను ఆధారంగా చేసుకుని విజయ్ కనకమేడల ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశారట. రెగ్యులర్ కమర్షియల్ అంశాలు మిస్ కాకుండా సమాజాన్ని ప్రశ్నించే రీతిలో చాలా బాగా వచ్చిందని అంటున్నారు. భారతీయుడు, ఠాగూర్ లో ఎలా అయితే మాస్ ఎలిమెంట్స్ మిస్ కాకుండా మెసేజ్ ఇచ్చారో అదే తరహాలో ఇది కూడా ఉంటుందని అంటున్నారు. దీని సంగతి ఆలా ఉంచితే ప్రస్తుతం గోపీచంద్ మలినేని సినిమా వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్న బాలయ్య నెక్స్ట్ వివేక్ ఆత్రేయకు ఎస్ చెప్పిన వార్త తెగ తిరుగుతోంది కానీ ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఏది ముందు మొదలవుతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. మలినేని మూవీని దీపావళి లేదా డిసెంబర్ లో విడుదల చేసే ప్లానింగ్ ఉంది. ఒకవేళ మిస్ అయితే మటుకు బాలయ్య 2027 సంక్రాంతికి ఆల్రెడీ పోటీలో ఉన్న నలుగురైదుగురు హీరోలకు కాంపిటీషన్ అవుతారు.

# జన గణనను జాగ్రత్తగా నిర్వహించాలి

చెన్నూరు, : జనగణన 2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. చెన్నూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఇళ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఇళ్ల గణనను పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలో గుర్తించబడిన ఇళ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందన్నారు. మే 11 నుంచి నిర్వహించనున్న ఇళ్ల గణను జాగ్రత్తగా నిర్వహించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున ఉదయం వేళలో ప్రక్రియ నిర్వహించేలా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు ఇళ్ల యాజమానులకు ముందుగా సమాచారం అందిస్తే వారు అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమీషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు సమయ పాలన పాటించాలని, ఇళ్ల గణన కొరకు నియమించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఇళ్ల గణనలో సందేహాల నివృత్తి కోసం గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతకుముందు కిష్టంపేటలోని డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. పట్టణంలో చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ , ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణం, వంటశాల, భోజనశాలలను పరిశీలించి విద్యార్థినీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీఎస్‌వో ప్రవీణ్‌కుమార్,ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

# మండలి చైర్మన్ గుత్తా కీలక వ్యాఖ్యలు




హైద్రాబాద్: : ప్రతి నెల అప్పులతోనే రాష్ట్రం మనుగడ సాగుతుందని..కొత్త అప్పు తేస్తే తప్ప వచ్చే మూడు నెలలు సజావుగా సాగే పరిస్థితి లేదని..గత ప్రభుత్వం నిర్వాకంతోనే ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిపోయి ప్రస్తుత ప్రభుత్వంపై భారం పడుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం నల్లగొండలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సమ్మె, ధాన్యం కొనుగోలు, ప్రాజెక్టుల నిర్వహణ, ఉద్యోగుల సమస్యలు, ఎన్నికల హామీలు, విద్యార్థుల సమస్యలు...ఇలా అన్ని కూడా ఆర్థిక పరిస్థితులతోనే ముడిపడి ఉన్నాయన్న వాస్తవాలు మరిచి ప్రతిపక్షాలు ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయడం సహేతుకం కాదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రిటైర్డ్ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు అని, ఈ బాధ నుండి తప్పించుకునేందుకు గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయో పరిమితి పెంచిందని గుత్తా పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు తొందరపడి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు అని, వారి సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుత్తా స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వం లోనూ తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె బాట పడుతున్నారని, వీలైనంత త్వరగా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించాలని గుత్తా సూచించారు. కార్మికుడు శంకరయ్య గౌడ్ ఆత్మహత్య పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సమస్యలకు చర్చలే పరిష్కారమని, ఆత్మహత్యలు ఏ కుటుంబానికీ క్షేమ దాయకం కావని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మె అయినా, ధాన్యం కొనుగోళ్లు అయినా వాస్తవాలు అన్ని పక్షాలకు తెలుసు అని, ప్రభుత్వం వైపు లోపం ఉంటే విపక్షాలు సలహాలు, సూచనలు చేయవచ్చు అని, కానీ ప్రతిదానికి విమర్శలు కరెక్ట్ కాదు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్తితి బాగోలేదు అని, వాస్తవాలను పక్కన పెట్టి ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తప్పు అని, ప్రజలను, కార్మికులను, ఉద్యోగులను, యువతను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలి అని చూడవద్దు అని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఆర్థిక భారం అని నిపుణులు చెబుతున్నారని, కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమీషన్ చట్ట వ్యతిరేకం అని కేసీఆర్, హరీష్ రావు కోర్టుకు వెళ్ళారని, ఘోష్ కమీషన్ చట్టబద్ధమే అని కోర్టు స్పష్టం చేసిందని గుత్తా గుర్తు చేశారు. కేవలం సెక్షన్ 8 కింద నోటీస్ ఇవ్వలేదు కాబట్టి వారిపై చర్యలు తీసుకోవద్దు అని మాత్రమే కోర్టు చెప్పిందని, అది సాంకేతిక అంశం మాత్రమేనని, వాస్తవాలు పక్కకు పెట్టి రాజకీయ పక్షాలు విమర్శ, ప్రతి విమర్శ చేసుకోవడం కరెక్ట్ కాదు అన్నారు. దాని వల్ల నష్టపోయేది ప్రజలేనని పేర్కొన్నారు. కాళేశ్వరం అంశంలో హైకోర్టు ఎవరికి క్లిన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. రైతు భరోసా ఏకకాలంలో అందిస్తేనే రైతులకు ప్రయోజనం ఉంటుందని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో బోనస్ వల్లే ప్రయోజనం ఉందని రైతులు అంటున్నారని, ఏదో ఒక స్కీమ్ ను పూర్తి స్థాయిలో అమలు చేస్తే రైతులకు ఉపశమనంగా ఉంటుందన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా యాసంగి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని, విత్తన రకాల వల్ల పలు చోట్ల ధాన్యంలో తాలు ఉందని మిల్లర్లు చెబుతున్నారని దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం వస్తుందని, మన దగ్గర పంట దిగుబడి పెరిగిందని ..అందుకే బాయిల్డ్ రైస్ సేకరణ పెంచాలని కేంద్రానికి రాష్ట్రం విజ్ఞప్తి చేసిందన్నారు. దాని పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నానని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో సాయం చేయాలని కోరినప్పటికి కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడం విచారకరం అన్నార్రు. యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. డీలిమిటేషన్ అమలు పరిణామాలు..అప్పటి రాజకీయ పరిస్థితు ఆధారంగా తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే విషయం నిర్ణయిస్తానని గుత్తా తెలిపారు.

# గుణశేఖర్ గారు లాజిక్ మిస్సయ్యారు



ఒక్కడు, చూడాలని ఉంది లాంటి అద్భుతమైన బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన దర్శకుడు గుణశేఖర్ కొత్త మూవీ యుఫోరియా ఫిబ్రవరిలో విడుదలైన సంగతి తెలిసిందే. ప్రమోషన్లు గట్రా గట్టిగానే చేశారు కానీ పనవ్వలేదు. బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ గా నిలిచింది. ఒక సీరియస్ ఇష్యూ మీద సందేశం ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ అన్ని వర్గాలను మెప్పించలేకపోయింది. అయినా సరే కొన్ని ప్రశంసలు కూడా వచ్చాయి. తాజాగా ఈ మూవీ ఓటిటి స్ట్రీమింగ్ కు సిద్ధమయ్యింది. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్ లో మాట్లాడుతూ గుణశేఖర్ చాలా ఓపెన్ అయ్యారు. కంటెంట్ ఈజ్ కింగ్ అంటారని, కానీ తాను కింగ్ లాంటి కంటెంట్ ఇస్తే ఆదరణ దక్కలేదని వాపోయారు. ఓటిటి విండోని మూడు నెలలకు పొడిగించకపోతే థియేటర్ మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఇందులో ఆడియన్స్ తప్పేమీ లేదని, అలవాటు చేయడం వల్లే ఇలా జరిగిందని, ఓటిటిల వల్లే జనాలు చిన్న సినిమాలకు థియేటర్లకు రావడం లేదని చెప్పుకొచ్చారు. కానీ ఇక్కడ కొన్ని లాజిక్స్ మిస్సయ్యారు. ఓటిటి వల్ల పరిశ్రమ ప్రభావితం చెందిన మాట వాస్తవమే కానీ ఆడియన్స్ పూర్తిగా థియేటర్లకు దూరం కావడం నిజం కాదు. అలా అయితే లిటిల్ హార్ట్స్ కు ముప్పై కోట్ల వసూళ్లు ఎలా వస్తాయి. ఎంత చిరంజీవి ఉన్నా మన శంకరవరప్రసాద్ గారుకి కేవలం క్రేజ్ వల్ల మూడు వందల కోట్లు రాలేదుగా. చాలా అంశాలు పని చేసాయి. అన్నింటికి కంటెంటే ముఖ్యం. అది ఉన్నప్పుడు జనం ఎంత బడ్జెట్ పెట్టారు ఎవరు నిర్మాత లాంటివి పట్టించుకోరు. ఇక ఓటిటి గ్యాప్ ని తొంభై రోజులకు పెంచడం స్టార్ హీరోల సినిమాలకు మేలు చేయొచ్చేమో కానీ చిన్న చిత్రాలకు మాత్రం ఖచ్చితంగా దెబ్బే. డిజిటల్ లో లేట్ గా వస్తుంది కాబట్టి బాలేని మూవీని కూడా థియేటర్లో చూద్దామనుకునే ప్రేక్షకులు ఇప్పటి జనరేషన్ లో లేరు. అలాంటప్పుడు లాంగ్ విండో పని చేయదు. కట్టడి అవసరమే కానీ మరీ ఇంత తీవ్రంగా కాదు. యుఫోరియాలో మెసేజ్ చెప్పే ఉద్దేశంతో డ్రామాని మరీ ఓవర్ ఇంటెన్స్, డెప్త్ గా తీయడం వల్ల జనాలకు అనలేదు కానీ లేదంటే ఇదీ హిట్టు కొట్టేదిగా.

# చెల్లి ప్రియుడిని కొట్టి చంపిన అన్నలు

హైదరాబాద్ : ఫగుజరాత్‌లోని రాజులాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పాత ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ముగ్గురు సోదరులు కలిసి ఓ యువకుడిని అత్యంత కిరాతకంగా కొట్టి చంపారు. తమ చెల్లెలితో ప్రేమ వ్యవహారం నడిపాడన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు దినేష్‌కు, నిందితుల సోదరి సోనాల్‌కు మధ్య ఏడాది క్రితం ప్రేమ వ్యవహారం నడిచింది. ఆ సమయంలో దినేష్ ఆమెను మోర్బీకి తీసుకెళ్లాడు. అయితే, రెండు నెలల తర్వాత సోనాల్ తిరిగి తన తండ్రి ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే దినేష్‌ను చంపేస్తామని నిందితులు గతంలో బెదిరించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 18న దినేష్, వ్యవసాయ కూలీలతో కలిసి మోర్బీ నుంచి వచ్చి తన స్నేహితుడి పొలానికి వెళ్లాడు. రాత్రి 8:30 గంటల సమయంలో పొలంలో స్నేహితుడితో కూర్చుని ఉండగా, సోనాల్ సోదరులైన రాజేష్, సుర్‌సింగ్, కేవల్ బైక్‌పై అక్కడికి చేరుకున్నారు. దినేష్‌ను కాస్త దూరంగా తీసుకెళ్లి, 'మా చెల్లిని తీసుకెళ్లి మా పరువు తీశావు' అంటూ వాగ్వివాదానికి దిగారు. ఆ తర్వాత అతడిపై దాడికి దిగారు. రాజేష్ తన బెల్టు తీసి కొట్టగా, సుర్‌సింగ్ తాడుతో తలపై దాడి చేశాడు. కేవల్ కూడా బెల్టుతో విచక్షణారహితంగా కొట్టాడు. దాదాపు రెండు గంటల పాటు ముగ్గురూ ఒకరి తర్వాత ఒకరు బెల్టులు, తాళ్లతో దినేష్‌ను తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన దినేష్‌ను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

# సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు



హైదరాబాద్: వరంగల్ జిల్లా నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ బలవన్మరణం అత్యంత బాధాకరం అన్నారు. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు.. చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని మహేశ్ గౌడ్ సూచించారు. ఇది ప్రజా ప్రభుత్వం.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్య కృషిచేస్తోందని వివరించారు."నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ గారి విషాద మరణం పట్ల తీవ్రంగా విచారిస్తున్నాను. ఆయన అకాల మరణం హృదయ విదారకం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను." అంటూ మహేశ్ గౌడ్ ఎక్స్ లో పోస్టు చేశారు. వరంగల్‌లోని నర్సంపేట బస్టాండ్‌లో గురువారం ఆత్మహత్యకు యత్నించిన నర్సంపేట ఆర్టీసీ డిపో బస్సు డ్రైవర్ కె. శంకర్ గౌడ్, శుక్రవారం తెల్లవారుజామున కాంచన్‌బాగ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తీవ్రమైన కాలిన గాయాల కారణంగా మరణించారని వైద్యులు తెలిపారు. శంకర్ గౌడ్ తెల్లవారుజామున 2:30 గంటలకు మరణించినట్లు పోలీసులు ధృవీకరించారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి చెందిన ఫోరెన్సిక్ వైద్యుల పర్యవేక్షణలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వారు తెలిపారు. శవపరీక్ష పూర్తయ్యాక, మృతదేహాన్ని నర్సంపేట మండలం, ముతోజిపేట గ్రామంలోని గౌడ్ స్వగ్రామానికి తరలించారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో ఎంతో మేలు



మహబూబ్ నగర్ : నగరం సమాంతరంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నామనిప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మహబూబ్ నగరంలోని 21వ డివిజన్‌లో జనరల్ ఫండ్స్ ద్వారా రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. భవిష్యత్తు కూడా బాగుండాలనే సంకల్పంతో ప్రతి విషయంలోనూ అన్ని అలోచించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ డ్రైనేజీ నిర్మాణం ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న కాలువ సమస్యలు, వర్షాకాలంలో ఏర్పడే నీటి నిల్వలు, ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యాలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్ నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత ఇస్తూ, అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్లు గుండా సంతోష్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, పెద్దగొల్ల నర్సింహులు, రామస్వామి అలాగే నాయకులు మైత్రి యాదయ్య, గుండా మనోహర్, నిర్మల, శ్రీను, లక్ష్మణ్ మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తగ్గిన బియ్యం ఎగుమతులు

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం భారత బియ్యం ఎగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బియ్యం ఎగుమతులు 7.5 శాతం క్షీణించి 11.53 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా ఇరాన్, యుఎఇ, సౌదీ అరేబియా వంటి దేశాలకు ఎగుమతులు భారీగా తగ్గాయి. గత మార్చి నెలలోనే ఎగుమతులు 15.36 శాతం పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భారత బాస్మతి బియ్యానికి అతిపెద్ద మార్కెట్ అయిన ఇరాన్‌లో అస్థిరత నెలకొనడంతో ఆర్డర్ల రాక, చెల్లింపుల ప్రక్రియ, షిప్పింగ్ షెడ్యూళ్లు అన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ఎగుమతిదారులు తమకు రావాల్సిన బకాయిల విషయంలో అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. మరోవైపు దేశీయంగా బియ్యం దిగుబడి హెక్టారుకు 3.2 టన్నులకు పెరిగినప్పటికీ.. అంతర్జాతీయంగా తలెత్తిన ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సామాన్య రైతులపై, ఎగుమతిదారులపై భారంగా మారుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పడిపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆదాయ అసమానతలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. యుద్ధం వల్ల రవాణా ఖర్చులు పెరగడం, సామాన్యుడికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యవసాయ రంగం విదేశీ మార్కెట్లపై ఆధారపడటం ఈ విపత్కర పరిస్థితుల్లో శాపంగా మారుతోంది. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే గ్లోబల్ మార్కెట్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని కోల్పోవడమే కాకుండా దేశీయంగా రైతుల సంక్షేమం దెబ్బతినే అవకాశం ఉంది.

# రైతులు సన్నరకం ధాన్యం పండించాలి

సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రోహిస్తున్న తరుణంలో రైతులు సన్నరకం ధాన్యాన్ని పండించాలని, అలాగే కొనుగోలు కేంద్రాలల్లోనే ధాన్యంను విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరలను పొందాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ కోరారు. తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యంను పరిశీ లించడంతో పాటు తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎంత ధాన్యం వస్తుంది.. ఎన్ని గన్నీ బ్యాగులు ఉన్నాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అన్ని వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రా లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజన్ నర్సింహ, తహసీల్దార్ విజయ్‌ప్ర కాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ సేవలు

ఆమనగల్లు, : ఆమనగల్లు ప్రాంత ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలోనే ఐదు పడకల డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రానున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ లలితాదేవి వెల్లడించారు. ఆమె నిర్మాణంలో ఉన్న ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్సీ) నూతన భవనాన్ని సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన భవనం ప్రారంభమైన వెంటనే అందులో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నఈ ప్రాంత రోగులకు స్థానికంగానే చికిత్స అందనుంది. నూతన సీహెచ్సీ భవనంలో అత్యాధునిక వసతులతో కూడిన ఐదు పడకలను ఈ కేంద్రం కోసం కేటాయించినట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# హైదరాబాద్ శివారులో జపాన్ తరహా ఎకో టౌన్



హైద్రాబాద్: విశ్వనగరంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతుండగా.. నగరంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక వినూత్న ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండ రావిర్యాల గ్రామంలో సుమారు 494 ఎకరాల విస్తీర్ణంలో ఎకో టౌన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. జపాన్‌లోని ప్రసిద్ధ కీటక్యూషు నగర అధికారుల సహకారంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. దీనికి సంబంధించి రెవెన్యూ, టీజీఐఐసీ, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా నివేదికను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఏడాది ఏప్రిల్‌లో జపాన్‌లో పర్యటించినప్పుడు కీటక్యూషు నగరాన్ని సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న అద్భుతమైన ఘన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను చూసి ముగ్ధులైన సీఎం.. హైదరాబాద్‌లోనూ అటువంటి నగరాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం, కీటక్యూషు నగర అధికారుల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. తొలుత ఈ ప్రాజెక్టును 80 ఎకరాల్లోనే చేపట్టాలని భావించినప్పటికీ ప్రాజెక్టు విస్తృతిని బట్టి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో 494 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.పది నెలల సుదీర్ఘ చర్చల అనంతరం ఈ ప్రాజెక్టు ఒక కొలిక్కి వచ్చింది. గత ఏడాది జూన్‌లో కీటక్యూషు మేయర్ కజూషియా టేకూచి హైదరాబాద్‌లో పర్యటించి.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. ఎకో టౌన్ నిర్మాణం కోసం కనీసం 500 ఎకరాల స్థలం అవసరమని జపాన్ ప్రతినిధులు కోరడంతో హైదరాబాద్ ఓఆర్ఆర్ సమీపంలో ఉన్న బండ రావిర్యాల భూములను అధికారులు ఎంపిక చేశారు. ఈ ఎకో టౌన్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు, పర్యావరణ హిత గృహ సముదాయాలు, పచ్చదనానికి పెద్దపీట వేయనున్నారు. త్వరలోనే ఎంపిక చేసిన భూములను జపాన్ ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించనుంది. ఈ పర్యటన ముగిసిన వెంటనే ప్రభుత్వం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనుంది. ఈ ఎకో టౌన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా, పర్యావరణ నిర్వహణలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఇది రాజధాని ప్రాంతంలో కాలుష్య నియంత్రణకు, స్థిరమైన అభివృద్ధికి ఒక మోడల్‌గా నిలవనుంది.

# అద్భుతమైన అభివృద్ధి చేసుకుందాం

మహబూబ్ నగర్, : నగరం అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న అడుగులు వేస్తున్నామని డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి అన్నారు. నగరం లోని 31వ డివిజన్ లో వార్డు సభ లో మహిళలకు చీరలను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడారు. మాయమాటలు చెప్పి కాలం గడిపే విధానం తమది కాదని నిక్కచ్చిగా చేసేది.. చేయబోయేది మాత్రమే చెప్పడం జరుగుతుందన్నారు. మీ అందరి సహకారంతో భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని వందకు వందశాతం సద్వినియోగం చేసుకునేలా అడుగులు వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ఎక్కడ రాజీ పడకుండా ప్రజల అవసర లలో ప్రార్ధన్యత క్రమంలో ప్రతిదీ పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలందరికీ నచ్చే నాయకులుగా పనిచేస్తున్నామని ప్రజాపాలన ప్రభుత్వానికి మనందరం అండగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. నిర్లక్ష్యమనే మాటకు తావు లేకుండా అభివృద్ధి కోసం కంకణ బద్ధులమై పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గొప్ప ఆలోచనలతో అడుగులు వేస్తున్నారని, వారి అడుగుజాడల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజన్న, ఆర్పి వరలక్ష్మీ, వార్డ్ ఆఫీసర్ బాలకృష్ణ, మైత్రి యాదయ్య, శ్రావణ్ కుమార్ చిన్నా యాదవ్, రాకేష్ యాదవ్, రమేష్, చందు, అక్బర్, అఖ్తర్,రామలక్ష్మీ,వార్డ్ ప్రతినిధులు, మహిళా సంఘాలు,వివిధ పార్టీల నాయకులు, సంఘ నాయకులు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# 9ఎకరాలను కాపాడిన హైడ్రా



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామంలో 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. దీని విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సర్వే నంబర్ 626/2లో మొత్తం 176.05 ఎకరాల ప్రభుత్వ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉంది. అటవీ అభివృద్ధి సంస్థకు 166 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇంకా అక్కడ 9.05 ఎకరాల ప్రభుత్వ భూమి మిగిలింది. ఖస్రా పహాణీ( గ్రామ పాత రికార్డుల) ప్రకారం మొత్తం 176.05 ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదైంది. ఇందులోని 9.05 ఎకరాలను సీఎస్ 14 (నిజాంలకు చెందిన) భూములుగా పేర్కొంటూ కొంతమంది హక్కులు క్లైమ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.మొత్తానికి ఈ వివాదం హైకోర్టులో పెండింగ్ ఉంది. తుది తీర్పు వచ్చే వరకూ ఈ భూమి స్వరూపాన్ని మార్చరాదని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే ఇచ్చింది. స్టేటస్ కో ఆర్డర్‌ను పట్టించుకోకుండా.. తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి ఆ భూమిని చదును చేసి లే ఔట్‌గా మార్చినట్టు రంగరెడ్డి కలెక్టర్‌తో పాటు.. శంషాబాద్ మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించగా.. తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ 9.05 ఎకరాల భూమిని చదును చేసి.. ప్రీకాస్ట్ గోడల ద్వారా ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం ఆక్రమణలను తొలగించాలని మొయినుద్దీన్‌కు సూచించారు. ఇవేవీ పట్టించుకోకుండా.. అక్కడ కొన్ని ఇంటి స్థలాలు అమ్ముకున్నట్టు కూడా తెలుసుకున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇదే విషయాన్ని హైడ్రాకు చెబుతూ.. ఆక్రమణలు తొలగించాలని లేఖ రాశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో బుధవారం హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టి.. 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది. చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

# మైక్రోసాఫ్ట్ 'బైఅవుట్' ఆఫర్

న్యూఢిల్లీ:సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన 51 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒక కొత్త నిర్ణయం తీసుకుంది. అమెరికాలోని తన ఉద్యోగులకు 'వాలంటరీ బైఅవుట్' ఆఫర్‌ను ప్రకటించింది. సాధారణంగా కంపెనీలే ఉద్యోగులను తీసేయడం మనం చూస్తుంటాం. కానీ, మైక్రోసాఫ్ట్ మాత్రం "మీకు ఇష్టమైతే ఉద్యోగం వదిలేయండి.. మీకు భారీగా మనీ ఇస్తాం" అంటూ బై అవుట్ ప్లాన్‌తో ముందుకు వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వస్తున్న మార్పుల వల్ల కంపెనీ తన పనితీరును మార్చుకోవడమే దీనికి ప్రధాన కారణం. అసలు 'బైఅవుట్' అంటే ఏమిటి? చాలా మందికి లేఆఫ్స్‌కి, బైఅవుట్‌కి తేడా తెలియదు. లేఆఫ్ అంటే కంపెనీ బలవంతంగా ఉద్యోగిని తీసేయడం. కానీ, బైఅవుట్ అంటే ఉద్యోగికి ఒక చాయిస్ ఇవ్వడం. "నువ్వు సొంతంగా వెళ్ళిపోతే.. నీకు ఒకేసారి పెద్ద మొత్తంలో నగదు, మరికొన్ని నెలల పాటు హెల్త్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ ప్లాన్స్ ఇస్తాం" అని కంపెనీ ఆఫర్ చేస్తుంది.అంటే, ఎవరైనా రిటైర్మెంట్ దగ్గరలో ఉన్నవారు లేదా కొత్తగా ఏదైనా చేయాలనుకునే వారు ఈ బైఅవుట్ ఆఫర్‌ను వాడుకుని గౌరవప్రదంగా కంపెనీ నుంచి బయటకు వచ్చేయవచ్చు. ఎవరెవరు అర్హులు? మైక్రోసాఫ్ట్ తన అమెరికా ఉద్యోగుల్లో సుమారు 7 శాతం మందికి ఈ ఆఫర్ ఇచ్చింది. అయితే దీనికో చిన్న కండిషన్ ఉంది. సీనియర్ డైరెక్టర్ స్థాయి అంతకంటే తక్కువ కేడర్ వాళ్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ముఖ్యమైన నియమం: ఉద్యోగి వయస్సు, ఆ కంపెనీలో పనిచేసిన ఏళ్లు.. ఈ రెండింటిని కలిపితే 70 అంతకంటే ఎక్కువ ఉండాలి. ఉదాహరణకు, మీ వయస్సు 50 ఏళ్లు ఉండి, మీరు మైక్రోసాఫ్ట్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తుంటే, మీరు ఈ ఆఫర్‌కు అర్హులు. అయితే సేల్స్ విభాగంలో ఉండి ఇన్సెంటివ్స్ తీసుకునే వారికి మాత్రం ఈ స్కీమ్ వర్తించదు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మే 7న కంపెనీ వెల్లడించనుంది. ఎందుకీ నిర్ణయం? ప్రస్తుతం టెక్ ప్రపంచాన్ని ఏఐ శాసిస్తోంది. మైక్రోసాఫ్ట్ కూడా ఏఐ మౌలిక సదుపాయాల కోసం, డేటా సెంటర్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు చేస్తోంది.

# వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్, విద్యార్థులు వేసవి కాలాన్ని వృధా చేసుకోకుండా మైండ్ స్పార్క్ అనే యాప్ ని డౌన్లోడ్ చేసుకుని, ప్రతిరోజు గంట పాటు ప్రాక్టీస్ చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల హసన్ పర్తి ప్రిన్సిపాల్ సుధాకృష్ణ అన్నారు. గురువారం హసన్ పర్తి గురుకుల పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకృష్ణ 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, పెన్నులు అందించి సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ లో 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆర్జెసి సెట్ కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టడం వలనే, తమ పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె ఎఫెక్ట్.. మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంపు!

హైద్రాబాద్: ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసుల రవాణా కష్టాలను తీర్చేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్అండ్‌టీ మెట్రో సంస్థతో జరిపిన సంప్రదింపుల అనంతరం మెట్రో రైళ్ల రాకపోకల ఫ్రీక్వెన్సీని గరిష్ట స్థాయికి పెంచుతున్నట్లు ప్రకటించింది. సాధారణ రోజుల్లో కేవలం రద్దీ సమయాల్లో మాత్రమే నడిపే 56 రైళ్లను, ఇప్పుడు సమ్మె కాలంలో రోజంతా నిరంతరాయంగా నడపాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రైళ్లు అందుబాటులో ఉంటాయి.సాధారణంగా రద్దీ లేని సమయాల్లో రైళ్ల సంఖ్యను తగ్గించి 44 రైళ్లను మాత్రమే నడుపుతుంటారు. కానీ ఇప్పుడు ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఆ విధానానికి స్వస్తి పలికారు. సమ్మె సమయంలో మియాపూర్ నుండి ఎల్బీనగర్ కారిడార్‌లో ప్రతి 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు, అలాగే నాగోల్ నుండి రాయదుర్గం కారిడార్‌లో ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల బస్సులు లేక ఇబ్బంది పడుతున్న నగరవాసులకు మెట్రో ప్రయాణం ఎంతో ఊరటనివ్వనుంది. అంతేకాకుండా అర్ధరాత్రి వేళల్లో ప్రయాణించే వారి ఇబ్బందులను గమనించిన మెట్రో అధికారులు మరో కీలక అంశంపై దృష్టి సారించారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకు ఉన్న మెట్రో చివరి రైలు సేవలను, సమ్మె ముగిసే వరకు మరికొంత సమయం పొడిగించే అంశాన్ని ఎల్అండ్‌టీ పరిశీలిస్తోంది. ప్రభుత్వ విన్నపం మేరకు రాత్రి వేళల్లో కూడా అదనపు సర్వీసులు నడపడం ద్వారా సామాన్య ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యంగా మెట్రో యంత్రాంగం పనిచేస్తోంది. ప్రయాణికుల రద్దీని బట్టి త్వరలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# బకాయిల చెల్లింపు దిశగా చర్యలు..




హైద్రాబాద్:తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని సమావేశం అనంతరం విడుదలైన ప్రకటన పేర్కొంది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదని తెలిపింది. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్న విషయాన్ని మంత్రివర్గం పరిగణనలోకి తీసుకుంది. ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేసేందుకు మంత్రులందరరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. రెండు రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను విరమించాలని ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. కార్మికులు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపింది. సమస్యలను పరిష్కరించాలనే సానుకూల వైఖరితోనే ప్రభుత్వం అధికారుల కమిటీ వేసిందని పేర్కొంది. శుక్రవాం ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు కేబినెట్ విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర క్యాబినెట్ చర్చించింది. జ్యుడిషియల్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు తప్పుబట్టలేదని, కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుబట్టలేదని పేర్కొంది. జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమని, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడింది. పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే కేవలం సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టిందని, ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవని, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చిందని ఒక ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయాన్ని ఆ ప్రకటన ప్రస్తావించింది. తొమ్మిది నెలలైనా సీబీఐ దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొంది. హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలిపిన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేయాలని ప్రభుత్వం తరఫున మరోసారి సీబీఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు మొత్తం పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా.. లేదా.. అనేది, వారిచ్చే సలహాలు ఆధారంగా నడుచుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన పీఏసీఎస్‌లకు నామినేట్ పద్ధతిన పాలకవర్గాలను నియమించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుబాటులో ఉన్న 76 ఎకరాలకు గాను.. 64 ఎకరాల్లో 21 రకాల క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడం, అవుట్‌డోర్ స్టేడియం సామర్థ్యం 20 వేల నుంచి 50 వేలకు పెంచడంపై నిర్ణయాలు తీసుకున్నది. స్విమ్మింగ్ పూల్ సామర్థ్యం పెంపుతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు... క్రీడాకారులకు వసతి, శిక్షణ సౌకర్యాలు కల్పించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్‌కు ఇచ్చి, కమర్షియల్ యాక్టివిటీస్‌కు అనుమతి మంజూరు చేసింది. కమర్షియల్ యాక్టివిటీస్ ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ తదితర కార్యక్రమాలకు ఉపయోగించాలని కేబినెట్ నిర్ణయించింది.

# వ్యవసాయ వ్యర్ధాలతో పెల్లెట్స్ స్టవ్



చేవెళ్ళ : జేకేఎంఆర్ ఫౌండేషన్ యువత తయారు చేసిన వివిధ రకాల బయో బయోమాస్ పెల్లెట్ గ్యాసిఫైయర్ స్టవ్ వినియోగం గూర్చి స్థానిక రెస్టారెంట్, హోటల్స్, మెస్ ఓనర్స్ కు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా చూపించారు.యుద్ధం వల్ల సంభవించిన ఎల్ పిజి కొరత దృష్టిలో ఉంచుకొని చిన్న ఫుడ్ బిజినెస్ వాళ్లకు జరుగుతున్న ఇబ్బంది తొలగించడానికి యుద్ధం మొదలైన మరుసటి రోజు నుంచే జేకేఎంఆర్ ఫౌండేషన్ టీం వివిధ రకాలుగా రీసెర్చ్ చేసి రూపొందించిన పెల్లెట్ స్టవ్ లను వాడడం వాటి ఉపయోగాన్ని తెలిపినారు. ఖర్చు గ్యాస్ కంటే తక్కువ అవుతుందన్నారు. పర్యావరణానికి తక్కువ నష్టం కలుగుతుంది.పెల్లెట్స్ జొన్న సొప్ప, వరి పొట్టు, మక్క బుట్టలు, ఇతర వ్యవసాయ ఆధారిత మిగిలిపోయిన వ్యర్థాల నుండి తయారు అవుతాయి. మన దేశం లక్షలాది కోట్ల రూపాయలతో ఎల్ పిజి దిగుమతి చేసుకుంటుంది. బయోమాస్ పెల్లెట్స్ వాడుకలోకి వస్తే దేశానికి లక్ష కోట్ల సంపద మిగులుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఎటువంటి విపత్తుల సమయంలో ఈ ఫౌండేషన్ తన బాధ్యతను నిర్వర్తిస్తుందని చెప్పారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం, మున్సిపల్ బిజెపి ప్రెసిడెంట్ అనంతరెడ్డి, శంకర్పల్లి బిజెపి ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి, రామన్నగూడ కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్, సత్యనారాయణ శర్వలింగం, ప్రభాకర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఇంద్రసేన రెడ్డి వడ్ల నందు, శ్రీకాంత్ రెడ్డి గణేష్ విఠల్ రెడ్డి జేకేఎంఆర్ టీం సభ్యులు, స్థానిక హోటల్స్ యజమానులు పాల్గొన్నారు.

# ఓటర్ మ్యాపింగ్ బీఎల్ఓలకు శిక్షణ

కడ్తాల్, : కొత్త ఓటర్ల జాబితా రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో, కడ్తాల్ మండల కేంద్రంలో కీలక సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయశ్రీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీూా) ఓటర్ మ్యాపింగ్ మరియు జాబితా తయారీ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా బీఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని మరణించిన వారి వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలియజేసి, నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా నుండి వారి పేర్లను తొలగించాలని తాసిల్దార్ జయశ్రీ సిబ్బందికి సూచించారు.నేటి నుండి ప్రతి బీఎల్వో తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల వారీగా డోర్-టు-డోర్ సర్వే నిర్వహించి, ఓటర్ మ్యాపింగ్ పనులను 18 ఏళ్లు నిండిన వారు ఎవరూ మిగిలిపోకుండా వంద శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్ కోసం మీ ఇంటికి వచ్చే బీఎల్వోలకు ప్రజలందరూ సహకరించి, సరైన వివరాలు అందించి జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల పరిధిలోని బీఎల్వోలు, రెవెన్యూ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280